

## తీరని కోర్కెలు

‘‘ ఇక్కడికొచ్చి గూడా సుఖ సంతోషాలందిన వాళ్ళల్లే కనబడటం లేదు. మంచి పనులు, యజ్ఞాలు వంటివి చేయటం వల్ల వీసాలు శాంక్షనౌతాయి. వీసాలందాయంటేనే అవి చేశారని అర్ధం. బహుశా మీకింకా భూలోకం మీది భ్రమ తీరలేదన్నమాట. యేమైనా కోరికలుండి పోయాయేమో. మీలోకం మరపు వచ్చేదాకా రంభాద్యప్సరసల నాట్యం చూడండి. అమృతం లాంటి సాఫ్ట్ డ్రింక్స్ తాగండి. హంస తూలికా తల్పాల్లాంటి మబ్బు శయ్యల మీద శయనించి, తనివి తీరా కబుర్లాడుకోండి. నో డిస్టర్బన్స్. మీ కబుర్లు నాకు వినబడుతూనే వుంటాయి. నేను సహస్రాక్షినేగాక వేయి చెవులు గూడా గలవాడిని. మళ్లా వస్తా’’ అని వూరడించి అదృశ్యమైనాడు స్వర్గాధిపతి.

జీవులన్నీ చల్లని మెత్తల మీద వున్నాయి. రంగు రంగుల బట్టలలాంటి మబ్బులు కంఠం వరకు కప్పాయి. చేతులూ తలా కదిలించవచ్చు. మితంగా వెచ్చదనం, పారిజాత పూల వాసన గాక, నందనవనం మీదుగా, కల్పవృక్షం మీదుగా పరిమళం వెదజల్లుతూ పూలవాసనలు వస్తున్నాయి.

‘‘మొదట స్త్రీ జీవులకు అవకాశమిద్దాం. అందునా వృద్ధులకు’’ అన్నాడో వృద్ధ జీవుడు.

‘‘అలాగే’’ అన్నాయి తక్కిన జీవులు.

‘‘మీకింకా తీరని కోర్కెలేమైనా వుండి పోయాయా? అవి తీరకముందే నూకలు చెల్లాయా? ఋణం తీరిందా?’’ అని అడిగాడు వృద్ధుడు. ఒక జీవి లేచి ‘‘బాగా అన్నారు. నేను నా తుది కోర్కెలు? తీర్చుకోకముందే క్రూర వ్యాధి నా ఒంట్లో ప్రవేశించి, శిధిలం చేసి నన్ను లాక్కొచ్చేసింది’’. ‘‘యేమిటా తుది కోర్కెలు? ఇక్కడ రాత్రీ పగలూ లేవు. తిండికీ కాలకృత్యాలకీ లేవక్కర్లేదు. అదే స్వర్గం’’ అన్నాడు వృద్ధుడు.

''టు ఎర్ యీజ్ హ్యూమన్. మూర్ఛించి, నా మాటే నెగ్గాలని, నా పేర వున్న ఆస్తి అలా చేయించింది, పొరపాటు చేశాను. చివరికి అమూల్యమైన దాన్ని దూరం చేసుకున్నానే అని బాధ బయలుదేరింది. స్టోన్ రిజెక్టెడ్ బైది బిల్డర్ కమ్స్ టుది కార్నర్'' అని గ్రహించాను. సామదానబేధదండోపాయాలు అప్లై చేసి, దూరం చేసుకున్నదాన్ని తెచ్చి, హవేలీ సజావుగా రన్నయేటట్టు చేతామని చూస్తే పడింది గాదు. గ్రహించిందేమో! నేను మంచంలో వున్నాను. ఔరంగజేబ్ తొంభైయేళ్ల జీవించాడట. చివరిరోజుల్లో రివోల్ట్సు చూశాడు. కావేరీ వరకు విస్తరింపచేసిన మొఘల్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నమౌతున్నది. విశ్వాసపాత్రులు కరువైనారు. జన్మభూమిని వదలి, వేరు కాపరం పెట్టిన మహామహుడు గూడా చివరిరోజులలో తననెవరూ ఖాతరు చేయటం లేదనే బాధకు గురయాడు''.

''తీరని కోర్కెలు చెప్పవేం? పీఠిక బాగానే వున్నది''.

''అవినీతి అనే నేరం మోపి వెలివేసిన జీవిని తెచ్చి లోబరుచుకుని దాసిగా మార్చాలని, ఆ దాసికోసం దాని దాసుడు, (వాడు నా వాడే సుమీ) వస్తే యిద్దరినీ శాసిస్తూ నూర్జహాన్ లాగా హవేలీ యేలాలనే కోరిక తీరనే లేదు. మళ్లా పుట్టి ఆ కోర్కె తీర్చుకోవాలి''.

''భేష్! భేష్'' అన్నాయి వింటున్న జీవులు.

''నెక్ట్స్'' అన్నాడు వృద్ధ జీవి.

''నాకు చిన్నప్పటినించీ, మొదటినించీ, ధనికులైన బంధువుల పక్కయింట్లో వుండి వేరే కాపరం వెలిగిస్తూ వున్నదానితో తృప్తి కలిగి జీవిస్తూన్నట్టు కనిపిస్తూ, వారికి బంధువువనిపించుకోటం యిష్టం. అవి నాకు దూరమయాయి. కుటుంబ పెద్ద వుద్యోగస్థుడు గాదు. సంతానమూ గొప్పవాళ్లుగాలేదు. సో నా మెదడు చురుకుదనం వాడుకున్నాను. ధనాశలేదనేదాన్ని. డబ్బంటే తృణప్రాయమని అరిచేదాన్ని. నా శీలాన్ని పాడు జేయాలని ట్రై చేసినవాడిని అక్కడికక్కడే భస్మం చేశానని నమ్మిస్తూ, కళలు మారుస్తూ, యిచ్చకాలాడుతూ, సాయంగా వున్నట్టు భ్రమింపజేస్తూ నెగ్గుకొచ్చాను. ఖర్మ గూడా దేవుని లాగే

పవర్‌ఫుల్. ఆ ఖర్మ గాడిదలు తోలమన్నది. బెస్తవాడూ మత్స్యం కథలోలాగా మొదటికొచ్చానే అని చూశాను. పదునైన బుర్రకాయ అలాగే వున్నది. పాతికేళ్ల దానిలాగే గంతులేస్తున్నది. శరీరానికి తొంభై. పడిపోతున్న కొంప అమ్మి మహాపట్నం పోయి, అక్కడుంటున్న కడగొట్టు సంతానం, దాని యింటి పెద్ద మేడా హోదా వున్న చోటికి పోవాలనిపించింది. పక్కనే యిల్లు కొని బిజినెస్ రన్ చేస్తున్నట్టు కనబడుతూ, నిజానికి దోస్తూ, స్థిరపడాలని కోరిక కలిగింది. కాని అది తీరని కోర్కె అయింది. కనీసం అయిదు లక్షలన్నా కావాలిట మోడరన్ ఫ్లాట్ కొనటానికి. బిజినెస్‌కి మరో అయిదు. సాఫ్ట్‌వేర్ పెట్టాలనుంటే అయిదు తెమ్మన్నారు. కలర్‌లాబ్ అంతే. వీడియోఫిల్మ్‌లు తీసి డిడి మీద చూపాలంటే రెట్టింపు కావాలిట. ఛానెల్ పట్టుకోటానికి కావాలిట. అన్నీ కోర్కెలే. దేవుడు మళ్లా భూమి మీద వదిలితే నా బుర్ర నాతోనే వస్తుంది కనక సాఫ్ట్‌వేర్ బిజినెస్ మొదలుపెట్టి తక్కినవీ నెరవేర్చుకోవాలి. కొంప అమ్మాలని జూపితే లక్షన్నా పలకలేదు. అమ్మబోతే అడివీ, కొనబోతే కొరివీ'' ఆయాసపడింది జీవి.

''వండర్‌ఫుల్, బ్రేవో! గొప్ప బుర్రకాయ'' అన్నాయి జీవులు.

''నెక్స్ట్!''

''నా పేరు జగన్మోహిని. నన్ను చూస్తేనే నా పేరు తెలిసిపోతుంది. తుమ్మెద రెక్కలలాంటి నిడుపైన కేశరాశీ, శ్రీకారముల వంటి చెవులూ, కోల ముఖం సంపెంగ రెక్కలాంటి ముక్కు, హరివిల్లులాంటి మూతీ, ముద్దొచ్చే చిబుకం, కలువల లాంటి కళ్లు, అరమొగ్గిన బంగినపల్లి పండురంగు, సింగిణీవిల్లు లాంటి కనుబొమలూ, తామరతూడులులాంటి చేతులూ, పూలచెండ్లులుగా అరచేతులూ'' అంటున్నది.

''తీరని కోర్కెలే చెప్పాలి. నీ సౌందర్య వర్ణన కాదు''.

'' ఓహో! మరిచాను. గొప్ప వుద్యోగి భార్యనుకావాలనీ, భోగభాగ్యాలను అనుభవించాలనీ, అధికారం చెలాయించాలనీ కోరికలుంటే దానికి విరుద్ధంగా సత్యవంతునిలాగా అర్ధాయుష్షున్న మగడూ బాలగండాలున్న కొడుకూ

అంటుకున్నారు. దైవం, ''పాపం డిజప్పాయింట్ అయిందే?'' అని, వాళ్లిద్దర్నీ తీసుకుబోయాడు. హైసరబజ్జా అని వుద్యోగినిని కావాలని, పరీక్షలు పాసౌతుండగా విధి మళ్లా వంచించింది. అందగాడూ, వుద్యోగీ, రెండు చేతులా ఆర్జిస్తున్నవాడూ కంటబడ్డాడు. గమ్యం మరిచాను. వాడిని లొంగదీసి దాసునిగా మార్చాలని చూశాను. దైవం పకపక నవ్వి వాడికో కురూపిని వుచితంగా యిచ్చాడు. ధనికుడు, వుద్యోగి నన్ను నిరసించాడు. నా అహం దెబ్బ తిన్నది. వాడిది కడుపు నిండిన బేరమని అర్థమైనా, ఖరాబైన బుర్ర ప్రోత్సహించగా, కొండ శిలలాగా వాడిని చుట్టి మింగాలని చూస్తే ఆ కోరికా తీరలేదు. వాడు మింగుడు పడలేదు. పైగా జెలసీ అండ్ ఎన్వీ అనే విషసర్పాలు నన్ను చుట్టినై. కురూపిని కాటువేయాలనే తలపు తీరని కోర్కె అయింది. తీరని కోర్కెలతోనే యిక్కడి కొచ్చేశాను''.

''వాటెపిటీ! పూర్ బ్యూటీ!'' అన్నాయి జీవులు. చెప్పించుకోకుండానే మరొక జీవి అందుకున్నది.

''నా వయస్సుకి రెండురెట్ల వయస్సున్న మగనితో జీవిస్తూ మంచిగా, వినయంగా వుండి, మొదటి బిడ్డ బంగారమంటి కూతురుకి పెళ్లి చేసి యిక్కడికి వద్దామని చూస్తుండగా అంతా తారుమారైంది. పెళ్లీడు వచ్చిన కూతురుకి పెళ్లి చూపులకి వరుడొచ్చాడు. నెరిసిన గుండూ, పొట్టా, ఖాకీ చొక్కా, ఖద్దరు ధోవతీ, పారపళ్లు, పిల్ల తండ్రియీడు వాడేమో. వయస్సు బాగా తగ్గించి చెప్తున్నాడేమోననిపించింది. మంచి ఆస్తి, మంచి వుద్యోగం. పోనీ తలూపుదామనుకుంటే, మతిలేని మొదటి భార్యకి విడాకులిచ్చాడుట. ఆస్తికి వారసుడు కావాలిట. పెళ్లి చేసేసి పంపాలిట. పిల్ల తండ్రీ వుద్యోగే. ఆస్తీ వున్నది. పెళ్లాం మీద పెళ్లాం అనరూ లోకులు? లోభించాడనరూ తండ్రినీ! ఇవ్వమని పంపేశా. కోర్కె తీరకముందే వ్యాధి సోకింది. మంచి వైద్యం అందలేదు. చిన్న బిడ్డలని దిగులు పడ్డా. తండ్రి గుర్తు వచ్చాడు. సరీగ్గా యిదే యీడుకి యిలాగే బిడ్డల్ని వదిలిపోయాడు. ఇక్కడుంటాడని పరెగెత్తుకొచ్చా. కోర్కె తీరనే లేదు. మళ్లా పుట్టి తీర్చుకుంటా''

''అయ్యో పాపం!'' అని సింపతీ చూపాయి జీవులు.

ఉద్రేకపడిన ఒక జీవుడరవసాగాడు.

''నా తీరని కోర్కె వినండి. నా భార్యజ్ఞాతుల సలహాల మీద '' ఆస్తంతా మగడు పాడుజేస్తున్నాడు. పిల్లల భవిష్యత్తేమిటి?'' అని పిటీషన్ పెడితే, '' జ్ఞాతికి కంట్లోను పాముకి పంట్లోనూ విషముంటుందట, మనసు వికలమై, విరిగి, మతిపోయి, మొత్తం ఆస్తంతా భార్య పేర రిజిష్టర్ చేశాను లా ప్రకారం. అర్ధరాత్రి యిల్లు వదిలి, భార్యాబిడ్డల్ని వదిలి, బుద్ధదేవుని లాగా జుట్టు తీసేసి, బైరాగుల్లో కలిసిపోయాను. కాని, నేను వదిలి వచ్చిన పెద్ద ఆస్తిని నా భార్య కాపాడిందా? రెట్టింపు చేసిందా? పిల్లల్ని పైకి తెచ్చిందా? అని తెలుసుకోవాలనే కోర్కెలు తీరనే లేదు. ఇక్కడికి పరుగెత్తుకొచ్చాను''. విన్న జీవులు నోళ్లు వెళ్లబెట్టాయి. విరామం లేకుండా మరో జీవుడందుకున్నాడు.

'' ఆశలు పెంచుకుని, తండ్రి వదలి వెళ్లిన కుటుంబాన్ని ఆదుకోవాలని సాహసించి, దేశంలో తిరుగుతూ, పరీక్షలు పాసైనాను. గొప్ప కళాశాలలో ఆచార్యునిగా సెలెక్టయి, వుద్యోగంలో చేరబోతూ వురకలు వేసే మనస్సుతో పట్నం వెళ్లాను. ప్రయాణంలోనే భాగ్యరాశి తాను యింటర్వ్యూకి వెళ్తున్నానని చెప్పింది. వరించింది. పెళ్లాడుదామన్నది. ఇద్దరి సంపాదనతో మా కుటుంబాన్ని పైకి తెద్దామన్నది. వర్ణాంతర వివాహం జరుపుకుంటే ప్రభుత్వం సొమ్మిస్తుందన్నది. అన్నీ తీరనికోర్కెలే. సెలవుదినాలు వస్తే యీ శుభవార్తలన్నీ తల్లితో చెబుదామని యింటికి వచ్చి మంచమెక్కాను. ఇరవై ఒక్క రోజుల్లో తీసుకుపోయె సన్నిపాతం సోకిందనీ అమావాస్య వెళ్లాలి అనీ ఘనవైద్యుడన్నాడు. దేవునికి కన్ను కుట్టిందని బాధ కలిగింది. ఇష్టం లేకుండానే యిక్కడికి వచ్చేశాను. తమ్ములను చదివించాలి. చెల్లికి పెళ్లి చేయాలి. తల్లికి వృద్ధాప్యంలో ఆసరాగా వుండాలి అనే కోర్కెలు తీరలేదు''.

''విధి బలీయమని తెలుసు తెలుసు మాకు నీ మనసూ'' అని జీవులు పాడాయి.

పెద్దగా అరుస్తున్న జీవుని చూశాయి జీవులు.

''నేను భార్యను హత్యచేసి స్కాట్‌ఫ్రీగా తప్పించుకు వచ్చేశాను. కాని హత్యాపాతకం నన్నుచుట్టుకుని, రత్నాలంటి నా పిల్లలు పాడైపోయారు. మళ్లాపుట్టి నిర్భయంగా, హత్యానేరం ఒప్పుకుని వురితాడు మెడకు పెట్టించుకోవాలి. ఈ సారైనా నా బిడ్డలు పైకి రావాలి. అవే నా తీరని కోర్కెలు''.

యెంత సేపైందో. తక్కినవీ వారి తీరని కోర్కెలు చెపుతున్నారు. స్వర్గాధిపతి వచ్చేశాడు.

''రండి అందరూ. ఫ్రెషర్స్‌ని ఆహ్వానించాలి. అదీ ఆచారం. వారూ జీవులే. మీ తీరనికోర్కెలు వింటూనే వున్నాను. ఇక్కడే వుండిపోరు గదా. చేసినపుణ్యం అయిపోగానే జన్మభూమి, కర్మభూమికి వెళ్లిపోతారు. ఒకటి కాకపోతే మరిన్ని జన్మలెత్తి అయినా మీ కోర్కెలు తీర్చుకోవచ్చు. హరి దయా సింధు. తన ప్రతిబింబాలైన మిమ్మల్ని దయగాచూసి సంతోషపెడతాడు. మీ కోర్కెలు తీరేట్టు అనుగ్రహిస్తాడు'' అని పిలుచుకెళ్లాడు.